

రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ గెలుపును కోరుతూ ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం పార్టీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షురాలు లక్ష్మీశ్రీ ట్రాక్టర్ నడిపి అందరినీ ఆకట్టుకున్నారు. -మణికొండ

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్‌లో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు గల గ్రామీణ ప్రాంతవాసులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 30 రోజుల పాటు జరిగే శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కూడా ఉంటుందన్నారు.

ప్రధాన పార్టీ అభ్యర్థులు ముగ్గురూ..

ప్రస్తుత ప్రజాప్రతినిధులే!

ఒకరు సిట్టింగ్ ఎమ్మెల్యే । మరొకరు కార్పొరేటర్ । ఇంకొకరు మున్సిపల్ చైర్మన్





ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే



నరేందర్‌ముదిరాజ్, మణికొండ మున్సిపాలిటీ చైర్మన్



శ్రీనివాస్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో గ్రామ పంచాయతీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ వ్యవస్థల వరకు ఉన్నాయి. వీటిలో మూడు కీలక వ్యవస్థలకు ప్రజాప్రతినిధులుగా ఉన్న వారు ఈసారి ఎమ్మెల్యే స్థానానికి పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు సిట్టింగ్ ఎమ్మెల్యే కాగా, మరొకరు జీహెచ్ఎంసీ కార్పొరేటర్., ఇంకొకరు ఓ మున్సిపాలిటీ చైర్మన్ కావడం అందరికీ ఆసక్తి కలిగిస్తోంది. ఎలాంటి ప్రజాప్రతినిధిగా ఎన్నిక కాకుండానే నేరుగా ఎమ్మెల్యే టికెట్ సాధించి టి.ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ నియోకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం నియోజకవర్గ ప్రజలకు తెలిసిందే. అలా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన మరో రెండు పర్యాయాలు ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పేరొందిన ఆయన ప్రస్తుతం...4వ సారి బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీలో ఉన్నారు.

సాటి ప్రజా ప్రతినిధులే ప్రత్యర్థులు..

రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న టి. ప్రకాష్‌గౌడ్‌తో పాటు నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న తోకల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ నుంచి, మణికొండ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న కస్తూరి నరేందర్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్‌లను సాధించారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్, ఎమ్మెల్యేగా ఉన్న వారే ఎన్నికల్లో తలపడుతుండటం ఓటర్లలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. వీరిలో మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్‌కు తన మున్సిపాలిటీ, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డికి తన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లలో మంచి పట్టు ఉండగా, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కావటంతో ప్రకాశ్‌గౌడ్‌కు మాత్రం నియోజకవర్గ వ్యాప్తంగా పట్టుంది.

ఉన్నత స్థానాల వైపు పయనం ..

రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి 4వ సారి బరిలో ఉన్న ప్రకాశ్‌గౌడ్ ఈసారి గెలిస్తే పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇచ్చి ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశం కల్పిస్తుందని ఆశిస్తున్నారు. ఆయనతో పాటు మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌గా ఉన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌లు వారి ప్రస్తుత అధికార స్థానానికి మరో మెట్టు ఎక్కి ఎమ్మెల్యేగా అనిపించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే స్థానానికి పోటీ పడుతున్న ప్రకాశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డిలకు టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మారిన చరిత్ర ఉండగా, నరేందర్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ నుంచి కొన్ని రోజులు టీఆర్ఎస్ పార్టీలో ఉండి.. తిరిగి సొంత గూటికి చేరుకున్న చరిత్ర ఉంది.

ప్రజాభిమానంతో విజయం సాధిస్తా

- బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి
- అత్తాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న తోకల శ్రీనివాస్ రెడ్డి

అత్తాపూర్: రాజేంద్రనగర్ ప్రజలు తనపై చూపిస్తున్న అభిమానం, వారి ఆశీస్సులతో బీజేపీ అభ్యర్థిగా విజయం సాధిస్తానని ఆ పార్టీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అత్తాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి దొరల రాజ్యం నడుస్తోందని, ఎవరికి వారు ఇష్టానుసారంగా ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా తమ స్వాధీనంలోకి తీసుకున్నారని.. కోట్లాది రూపాయలను అక్రమంగా కూడబెట్టుకున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎన్‌జీఓస్ కాలనీలో పార్కు స్థలంగా ధ్రువీకరించిన స్థలాన్ని ఆక్రమించుకొని బహుళ అంతస్తులుగా మార్చిన ఘనత ఎవరిదో చెప్పాలన్నారు. ప్రజలంతా తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా స్వాగతం పలుకుతూ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారన్నారు. మతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న తాను వచ్చే ఎన్నికల్లో లక్షకు పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధిస్తానని శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తోకల శ్రీశైలం రెడ్డి, తోకల కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు నామినేషన్లు దాఖలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో శనివారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి తన నామినేషన్‌ను శనివారం అత్తాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మల్లయ్యకు అందజేశారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా ఆయన తన కుటుంబ సభ్యులు, కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే రాంమూర్తి, ముఖ్యులతో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశానని, తిరిగి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరితో కలిసి వచ్చి మరో నామినేషన్ వేస్తానని శ్రీనివాస్ రెడ్డి తెలిపాడు. దేశ జనహిత పార్టీకి చెందిన మహ్మద్ నవాజ్ తన మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. శనివారం కేవలం ఇద్దరు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను మొత్తం 34 మంది స్వీకరించారని ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు.

బల్క్ ఓట్లపై ఎమ్మెల్యే దృష్టి



మణికొండలోని ఓ గేటెడ్ కమ్యూనిటీవాసులతో సమావేశమైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ఇప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రకాశ్‌గౌడ్‌కు నెట్ వర్క్ ఉండటంతో ఒకేసారి ఎక్కువ మంది ఓటర్లను కలిసి వారి ఓట్లను పొందేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో ఎక్కువ మంది ఓటర్లు నివసిస్తుండటం, వారు స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న ప్రకాశ్‌గౌడ్‌ను నేరుగా పిలిపించుకొని సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. వారికి ఉన్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకోవడంతో పాటు ఎన్నికలు ముగియగానే వాటిని పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. ఓవైపు పార్టీ కేడర్ ఇంటింటి ప్రచారం... మరో వైపు ఎమ్మెల్యే గేటెడ్ కమ్యూనిటీల ప్రచారం నిర్వహిస్తున్నారు. దాంతో ఇప్పటి వరకు ఇతర పార్టీల కన్నా ప్రచారంలో బీఆర్ఎస్ కేడర్ ముందుగా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. శనివారం నిర్వహించిన ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ మండల సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, మణికొండ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, ఆర్. నర్సింహ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... షాదన్ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా... అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 30 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని... మృతి చెంది రెండు, మూడు రోజులు అవుతుందని పోలీసులు తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులను లేదా.. ఉస్మానియా మార్చురీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

నేడు బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం బాల బృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 'ఆటిట్యూడ్ ఆఫ్ గ్రాటిట్యూడ్' అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 9 ఏళ్ళ నుంచి 14 ఏళ్ళ లోపు విద్యార్థులు పాల్గొన వచ్చని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040 23001234లో సంప్రదించాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన తోకల సుధాకర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: నియోజకవర్గం అభివృద్ధిని చూసి బీజేపీ ముఖ్య నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. శనివారం మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ డివిజన్ ప్రతినిధి తోకల సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకురాలు శరణమ్మలు పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురువేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టి.ప్రేమ్‌గౌడ్ ,ఎస్ వెంకటేష్ , కుమార్, కాశిగారి యాదగిరి,మహేష్ రాజ్,రాజేష్ యాదవ్ ఉన్నారు.



తోకల సుధాకర్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

చిత్రపురి ఓనర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీతో ప్రమాణం చేయించిన అనిల్‌కుమార్

మణికొండ: నూతనంగా ఎన్నికయిన చిత్రపురి హెచ్ఐజీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ దొర వారితో ప్రమాణం చేయించారు. కమిటీ అధ్యక్షుడిగా కిలారు సురేష్‌బాబు, కార్యదర్శిగా రుద్రగిరిరెడ్డి, కోశాధికారిగా ముత్యాల శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ, చిత్రపురిలో నివసిస్తున్న కార్మికులు, టెక్నీషియన్లకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ వాజ్‌పేయి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నిర్మలరాజు, కమల, నళిని పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం ప్రారంభం



మణికొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

మణికొండ: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శనివారం నాయకులు ప్రభావతి, ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కాలనీల వారీగా ప్రచారం చేశారు. స్థానికుడు ఎమ్మెల్యేగా గెలిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, ఇప్పటికే మున్సిపల్ చైర్మన్‌గా ఆయన చేసిన అభివృద్ధి పనులు మనకు కనిపిస్తున్నాయని స్థానికులకు వివరిస్తున్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచే అత్యధిక ఎమ్మెల్యేలు గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, కాంగ్రెస్‌లోనే పేదలకు మేలు జరుగుతుందని ప్రచారం చేస్తున్నారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్: డివిజన్‌లో శనివారం కోరని శ్యామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు నారాయణ ముదిరాజ్, యాదయ్య, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

నరేందర్‌ను గెలిపించండి

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ విజయాన్ని ఆకాంక్షిస్తూ శనివారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండగళ్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నరేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పలువురి చేరిక

అత్తాపూర్: బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నరేందర్, దయానంద్ (బబ్లూ), ప్రవీణ్ యాదవ్, మహేశ్ యాదవ్, అర్జున్ యాదవ్, సుమంత్, సురేశ్, హరీష్, ప్రశాంత్, రాజు, అభిషేక్, మనోజ్ చారి, సుచి కుమార్, సాయి ముదిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ఐసీఏఐ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో విద్యార్థికి పట్టా అందజేస్తున్న ముఖ్యఅతిథులు

రాజేంద్రనగర్: దేశ ఆర్థిక వ్యవస్థ పరిరక్షణలో సీఏలు మూల స్తంభాల్లాంటి వారని ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఏ దయానివాస్ శర్మ, శ్రీధర్ ముప్పాళ్ల అన్నారు. రాజేంద్రనగర్ శివరాంపల్లిలోని ఎన్ఎస్‌సీ కన్వెన్షన్‌లో శనివారం ఏఐసీఏ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన దయానివాస్ శర్మ, శ్రీధర్ ముప్పాళ్ల మాట్లాడుతూ.. ఖాతాదారులను సరైన మార్గంలో నడిపించే బాధ్యత సీఏలపై ఉంటుందన్నారు. పన్నులు కట్టడానికి తగ్గించే ప్రయత్నం చేయరాదని సూచించారు. వస్తు సేవల పన్నుల (జీఎస్టీ) విధానం సజావుగా అమలయ్యేలా చూడటంలో సీఏలది ప్రధాన పాత్ర అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 1400 మంది విద్యార్థులు ఈ స్నాతకోత్సవం సందర్భంగా సీఏ కోర్సు పట్టా తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఏ సతీష్ కుమార్ మైలవరపు, సీఏ దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమాఖ్య ఆత్మీయ సమావేశం

రాయదుర్గం: శేరిలింగంపల్లి పట్టణ దివ్యాంగుల సమాఖ్య ఆత్మీయ సమావేశం శనివారం ఎమ్మెల్యే గాంధీ నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని గాంధీ హామీ ఇచ్చారు.సీఎం కేసీఆర్ దివ్యాంగుల పెన్షన్లను పెంచడంపై అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి పట్టణ సమాఖ్య ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఫకీర్, కోశాధికారి లింగమ్మ, ప్రతినిధులు వెంకటేష్, షబ్బీర్, హబీబ్ పాల్గొన్నారు.

నామినేషన్లకు గట్టి బందోబస్తు



ఎన్నికల నామినేషన్ల సందర్భంగా అత్తాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఏసీపీ గంగాధర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. – అత్తాపూర్

ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం

మైలార్‌దేవ్‌పల్లి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేస్తారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు టి ప్రేమ్‌గౌడ్ అన్నారు.ఇంటింటి ప్రచారంలో భాగంగా శనివారం డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ, బృందావన్ కాలనీల్లో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్ ,రాఘవేందర్ ,కాశిగారి యాదగిరి, లక్ష్మారెడ్డి, లావణ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో ఆర్టీఏ సేవలు ప్రారంభం

మణికొండ: ఇప్పటి వరకు అత్తాపూర్ కేంద్రంగా కొనసాగిన జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం సేవలు ఎట్టకేలకు మణికొండలోని నూతన కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. అత్తాపూర్‌లో ఉన్న జిల్లా ఆర్టీఏ కార్యాలయాన్ని మణికొండకు మార్చాలని 2015 సంవత్సరంలో ల్యాంకోహిల్స్ సమీపంలోని మణికొండ శివాలయం పక్కన 30 గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించింది. అప్పట్లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా ఉన్న పి.మహేందర్‌రెడ్డి ఆర్టీఏ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 5 కోట్లతో అధునాతన భవనం నిర్మించేందుకు చేపట్టిన పనులు ఇటీవల పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మణికొండలోని నూతన భవనంలో ఆర్టీఏ సేవలను ప్రారంభించారు. ఎన్నికల కోడ్ ఉండటంతో అధికారికంగా కార్యాలయాన్ని ప్రారంభించకుండా అధికారులే పూజలు చేసి తమ సేవలను ప్రారంభించారు.



మణికొండలో ప్రారంభమైన ఆర్టీఏ కార్యాలయం

అండర్ -19 ఫుట్‌బాల్ కెప్టెన్ నియామకం



అనస్ మోహియుద్దీన్

గోల్కొండ: 74వ స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా గోల్కొండకు చెందిన అనస్‌మోహియుద్దీన్ ఎంపికయ్యారు. గోల్కొండ రిసాలబజార్‌లోని గోల్కొండ క్లబ్‌లో సఫ్దర్‌పాషా శిక్షణలో రాటుతేలిన అనస్ గోల్కొండ ఫుట్‌బాల్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకు నగరంతో పాటు తెలంగాణలో జరిగిన వివిధ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ఆయన అనేక సార్లు విశిష్ట యువ క్రీడాకారుడిగా అవార్డులు పొందారు. శ్రీనగర్‌లో జరుగనున్న 74వ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడానికి అనస్‌మోహియుద్దీన్ ఎంపికయ్యాడు. శనివారం జట్టు సభ్యులు, కోచ్‌లతో అనస్ శ్రీనగర్‌కు బయలుదేరి వెళ్లారు.

బీజేపీ అభ్యర్థి తోకల ఆస్తులు, అప్పుల వివరాలు..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి దాఖలు చేసిన నామినేషన్ పత్రంలో తన ఆస్తి, అప్పు, స్థిర, చర ఆస్తుల వివరాలను వెల్లడించారు. 2018–19 సంవత్సరంలో రూ.81,250ల ఆదాయపు పన్ను చెల్లించగా... 2022–23లో రూ.7,52,490ల పన్ను చెల్లించినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన వద్ద రూ.1.74 లక్షల నగదు, ఐసీఐసీఐ బ్యాంక్‌లో రూ.1,68,327ల నగదు, యూనియన్ బ్యాంక్‌లో రూ.1757ల నగదు ఉందని తెలిపారు. తన భార్య పేరుపై ఐసీఐసీఐ బ్యాంక్‌లో రూ.2,488 లు, రూ.68,200ల నగదు చేతిలో ఉన్నట్లు వివరించారు. తన వద్ద 135 గ్రాముల బంగారం... దాని విలువ రూ.8.10 లక్షలు, తన భార్య వద్ద 189 గ్రాముల బంగారం... రూ.11.34 లక్షలు ఉందని పేర్కొన్నారు. తన వద్ద మొత్తం రూ.25,80,085, తన భార్య మొత్తం రూ.11,36,488ల ఆస్తి ఉన్నట్లు వివరించారు. తన పేరుపై చేవేళ్ల మండలంలో 3.16 ఎకరాల పొలం, దాని విలువ రూ.26 లక్షలని.. మున్సిపాలిటీలో 80 గజాల స్థలం.. దాని విలువ రూ.6 లక్షలుగా తెలిపారు. తన పేరుపై మహేంద్ర కారు ఉందని.. దాని విలువ రూ.16 లక్షల అని.. రూ.10 లక్షల లోన్ ఉందని అఫిడవిట్‌లో పొందుపరిచారు. శంషాబాద్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సైఫాబాద్, రాజేంద్రనగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ధర్నా, ర్యాలీలు తదితర వాటిపై కేసులు నమోదయ్యాయని.. వాటి వివరాలను పొందుపరిచారు.

శ్రీనివాస్ రెడ్డి విజయం ఖాయం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ బాబురావు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ గడ్డ బీజేపీ అడ్డా అని, శ్రీనివాస్ రెడ్డికు పార్టీ టికెట్ కేటాయించి యువ రక్తాన్ని బీజేపీ వెన్నుతట్టి ప్రోత్సహించిందని అన్నారు. శ్రీనివాస్ రెడ్డి విజయం ఖాయమని అన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానందం, మూల శ్రీనివాస్ గౌడ్, కోరని క్రాంతి, సందీప్ కుమార్ ముదిరాజ్, కీర్తి, శ్రీను, జి.పద్మావతి, మల్లేష్, రాకేశ్ గౌడ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



తోకల శ్రీనివాస్ రెడ్డిని కలిసిన నాయకులు

హెచ్‌సీయూలో పూలు, పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆయుర్వేద మొక్కలు, పండ్లు, పూల మొక్కలను నాటి పెంచేందుకు అవసరమైన భూమి చదును చేసే కార్యక్రమాన్ని శనివారం ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ వరలక్ష్మీ పర్యవేక్షణలో వలంటీర్లు, విద్యార్థులు ప్రారంభించారు. ఆయుర్వేద మూలికలు, పూలు, పండ్ల మొక్కలను నాటి వాటిని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలను హెచ్‌సీయూ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆదిత్యశ్రీ, కుసుమ, మధులత, కె వెంకటదాస్, ఉద్యానవన శాఖ అధికారులు మల్లేశం, శంకర్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

యజ్ఞ యాగాలతో దేశం సుభిక్షం

సుల్తాన్‌బజార్: యజ్ఞ యాగాలతో దేశం సుభిక్షంగా ఉంటుందని భజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. విద్య శక్తిపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజశ్యామల యజ్ఞం కార్యక్రమానికి భజరంగ్‌సేన ప్రముఖులు హాజరై యజ్ఞ యాగాదుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శృంగేరి పీఠాధిపతి శ్రీ భారతీతీర్థమహాస్వామి, విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి ఆశీర్వచనాలను పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యజ్ఞ యాగాల వల్ల దేశం సుభిక్షంతో పాటు అభివృద్ధి చెందుతుందన్నారు. నిత్యం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతూ.. సనాతన ధర్మం గురించి పౌరులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ధ్యేయంగా భజరంగ్ సేనా పనిచేస్తుందని వివరించారు. సంస్థ ప్రతినిధులు నందుకిశోర్ అగర్వాల్, సూర్య శుక్లా, అభినయ్ తివారి, వీరేందర్, రామేశ్వర్ మిశ్ర తదితరులున్నారు.

రాజాసింగ్‌కు సన్మానం

గోల్కొండ: గోషామహల్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ మరోసారి విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ నాయకులు దేవర వంశీ అన్నారు. శనివారం ఆయన బీజేపీ నాయకు లతో కలిసి రాజాసింగ్‌ను కలిశారు. ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. అశ్విన్‌మోదీ తదితరులున్నారు.

యువ రచయిత్రుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న మామిడి హరికృష్ణ

సుల్తాన్‌బజార్: సాహిత్య రంగానికి మరొక తరాన్ని అందించాలనే సంకల్పంతో మొదటి సారిగా తెలంగాణ సారస్వత పరిషత్ యువ రచయితల సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో యువ రచయిత్రుల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ సాహిత్యంలోని పలువురు రచయితల రచనలు, యువ రచయితలకు పరిషత్ ప్రేరణ కలిగించిందన్నారు. కవిత్వం, కథ ఎలా రాయాలనే అంశంపై మెర్సీ మార్గరేట్, పెద్దింటి అశోక్‌కుమార్ రెండు విడతలుగా స్ఫూర్తి కలిగించేలా ప్రసంగించారు. డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ.. రచయిత్రుల్లో రచన పరిణతి పెంపొందించడానికి ముందుండు మరిన్ని అధ్యాయ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, 170 మంది యువ రచయిత్రులు, కవయిత్రిలు సమ్మేళనంలో పాల్గొన్నారన్నారు.